సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 25 । మార్చి । 2024



నృసింహ యజ్ఞానికి ఏర్పాట్లు
సింహగిరిపై 26 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు తలపెట్టిన శ్రీసుదర్శన నారసింహ మహా యజ్ఞానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన
విశాఖ: శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.

రంజాన్ వేళలు
పాడేరు, అరకు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
పాడేరు, అరకు	6.14	4.45
రంపచోడవరం	6.11	4.44

న్యూస్‌రీల్

అడవికి నిప్పు
- ఆకతాయిల చేష్టలతో నష్టం
- వేడెక్కిన వాతావరణం



తైడ సమీపంలోని వ్యాపిస్తున్న పొగ



రోడ్డును ఆనుకుని కాలిపోతున్న అడవి

అనంతగిరి: మండలంలోని తైడ సమీపంలోని ఘాట్‌రోడ్డులో అడవికి ఆకతాయిలు ఆదివారం నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. వేసవి కావడంతో ఎండిపోయిన ఆకులకు నిప్పు అంటించడంతో మంటలు వ్యాపించాయి. తైడ నుంచి శివలింగపురం వరకు ఈ పరిస్థితి నెలకొంది. ఒక పక్క ఎండ ప్రభావం మరో పక్క మంటలు వ్యాపించడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

ఘనంగా తిరు కల్యాణోత్సవాలు
- నేడు స్వామి వారి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

ఎటపాక: మండలంలోని వెంకటరెడ్డిపేట గ్రామంలో వేంచేసియున్న అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా తెల్లవారుజామున స్వామి వారి కల్యాణోత్సవానికి అంకురార్పణ జరిగింది. ఉదయం అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణం అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. సోమవారం స్వామి వారికి అభిషేకం, హోమం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు స్వామివారి తిరు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నాటు తుపాకీలు అప్పగింత



నాటు తుపాకులను చూపిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ రఘునాథరావు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కొంత మంది ఆరు నాటు తుపాకులను స్వచ్ఛందంగా అప్పగించినట్లు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. ఓకుర్తి నుంచి నాలుగు, వంచంగి నుంచి రరెండు తుపాకులను స్వచ్ఛందంగా అందజేశారని ఆయన పేర్కొన్నారు. మండలంలో వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు 14 నాటు తుపాకులు రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్లకు వచ్చాయన్నారు. మిగిలిన వారు అప్పగించాలని ఆయన కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ రఘునాథరావు పాల్గొన్నారు.

మన్యసీమకు నవ్య శోభ



చింతూరు ప్రాంతంలో పూలతో కనువిందు చేస్తున్న మోదుగ చెట్లు

చింతూరు : వసంత రుతువులో మన్యసీమ కొత్త అందాలను సంతరించుకుంది. ఆకులు రాల్చిన చెట్లు కొత్తగా చిగుళ్ల తొడుగుతూ కనువిందు చేస్తున్నాయి. ఓవైపు చిగురిస్తున్న ఆకులు, మరో వైపు సింధూర వర్ణంలో మోదుగ పూల అందాలతో ప్రకృతి కాంత మురిసిపోతోంది. చింతూరు మండలంలో రహదారుల పక్కన మోదుగు చెట్లు పూలతో ఆహ్లాదం పంచుతున్నాయి. పూత వచ్చిందంటే హోళీ పండుగ వచ్చిందనే సంకేతంగా భావిస్తారు. ఈ ప్రాంతంలో యువత మోదుగు పూలతో రంగనీళ్లు తయారుచేసి హోళీ రోజున ఒకరిపై ఒకరు చల్లుకుంటారు.

కొండ కోనల్లో ప్రగతి బాట



అరకు-విశాఖ ప్రధాన రహదారి నుంచి కనిపిస్తున్న భీసుపురం-బిర్లిగూడ రింగురోడ్డు నిర్మాణం

- రూ.6.18 కోట్లతో ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం
- కొండలను తొలిచి ఏర్పాటు
- ఆరు గ్రామాలకు చేరువైన అభివృద్ధి, సంక్షేమం
- గిరిజనులకు తప్పిన అవస్థలు

అనంతగిరి: ఒకప్పుడు ఆ గ్రామాలకు కొండలు గుట్టలు ఎక్కి కాలినడకన వెళ్లాల్సిందే. అక్కడి ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఎన్నో కష్టాలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొండపై ఉన్న గ్రామాల రోడ్డు నిర్మాణానికి రూ.6.18 కోట్లు వెచ్చించింది. కొండను తొలిచి సుమారు ఐదు కిలో మీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మించింది. మండలంలోని పూలుగుడ, సరసపోదోర్, ఎగువశోభ, దిగువ శోభ, పోర్లపోదోర్, బీర్లిగూడ గ్రామాలకు వెళ్లేందుకు ఒకప్పుడు ఎన్నో అవస్థలు పడేవారు. ఎగువశోభ కొండ మీదుగా గుట్టలు దాటి సుమారు 6 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణించాల్సి వచ్చేది. రహదారి సౌకర్యం లేని కారణంగా ఆయా గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండేవి. అత్యవసర వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయేవారు. ఈ పరిస్థితుల్లో గిరిజన సంక్షేమశాఖ కొండలను తొలిచి సుమారు ఐదు కిలోమీటర్ల మేర తారు రోడ్డును నిర్మించింది. వాగులున్నచోట కల్వర్టులు ఏర్పాటుచేసింది. ఇప్పుడు వాహనాలు ఆయా గ్రామాలకు నేరుగా చేరుకుంటున్నాయి. అభివృద్ధి, సంక్షేమం వారికి చేరవవడంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది. ఆ ఆరు గ్రామాల ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.



కాఫీతోటలను ఆనుకుని నిర్మించిన తారు రోడ్డు



వాగుపై నిర్మించిన సిమెంటు రోడ్డు

బొర్రా గుహలు కళకళ
- రెండు రోజుల్లో రూ.3.40 లక్షల ఆదాయం



బొర్రాగుహలను తిలకిస్తున్న పర్యాటకులు

అనంతగిరి: మన్యంలోని సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకుల రాకతో కళకళలాడుతున్నాయి. వరుసగా మూడు సెలవులు కావడంతో భారీగా తరలివస్తున్నారు. బొర్రాగుహలను శనివారం 1400 మంది సందర్శించగా రూ. 1.20 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం 2,800 తిలకించగా రూ.2.20 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.

అమెరికా నౌకకు ఘన స్వాగతం



విశాఖ: టైగర్ ట్రయాంఫ్‌-2024లో పాల్గొనేందుకు యూఎస్‌కు చెందిన అర్లీ-బుర్క్ క్లాస్ గైడెడ్‌-మిసైల్ డిస్ట్రాయర్ యూఎస్ఎస్ హాల్సే(డీడీజీ 97) విశాఖపట్నం చేరుకుంది. ఈ నౌకకు భారత నావికాదళం ఘన స్వాగతం పలికింది.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మి
- ముఖ్య నేతలు, అభ్యర్థులతో భేటీ
- ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చ



పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మిని కలిసిన నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మి, పార్టీ అభ్యర్థులు

పాడేరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, శ్రేణులు పని చేయాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన సందర్భంగా పాడేరు ప్రాంతంలో వారు పర్యటించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జి.మాడుగుల జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మిని వారు కలిశారు. పాడేరు నియోజకవర్గంలో పార్టీ ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా అందాలంటే మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఎన్నికలు అయ్యేంత వరకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జోనల్ ఇంచార్జీ, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంగ్లన్నదొర, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగరాజు, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

హామీలన్నింటిని నెరవేర్చిన జగనన్న: ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: మన్యంలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఎల్లవరంలో అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం, వై.రామవరం మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చి ప్రజాతీర్పు కోరడానికి మరోసారి ఎన్నికలకు వెళ్తున్నారన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వం చరిత్రలో లేదన్నారు. గతంలో ఏదైనా పని చేయించుకోవాలంటే మండల కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నమని పరిపాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేశారన్నారు. ప్రతీ గ్రామంలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. గత ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వం పనితీరుకు తేడాను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వం చేరువైనందున గత ఎన్నికల కన్నా భారీ మెజారిటీ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాలుగు మండలాల పార్టీ శ్రేణులు

మోదమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానికుల ఇంటి పండగలతో సందడి నెలకొంది. అమ్మవారికి మట్టి ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదం పంపిణీ చేసింది.పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాల గుడికి భక్తుల తాకిడి నెలకొంది.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అర్హతే కొలమానంగా సంక్షేమం

- ఎన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీదే విజయం
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- ప్రజల మద్దతు కోరిన అరకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తనూజరాణి, మత్స్యలింగం



పెదకోడాపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు తనుజారాణి, మత్స్యలింగం

పెదబయలు: రాష్ట్రంలో అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రజలను ఓటు అడిగే హక్కు తమ పార్టీకే ఉందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆదివారం మండలంలో పెదకోడాపల్లి,కిముడుపల్లి, గోమంగి, గుల్లేలు, పోయిపల్లి, బొండాపల్లి పంచాయతీల్లో అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మా తనూజరాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం.. కార్యక్రమం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగన్ మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అమలు కాని హామీలతో గ్రామాలకు వచ్చే వారిని నమ్మవద్దని కోరారు. జగనన్న ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని గుర్తుచేశారు. గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారని వారు పేర్కొన్నారు. నేడు మారుమూల గ్రామాలకు సైతం రోడ్ల సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన మరింత చేరువ చేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినయ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ జెడ్పీటీసీలు కొంటా సూర్యనారాయణ, జర్సింగి గంగాభవాని, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు వంతాల ఆనందరావు, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ విజేత ఈకోర్సా



ట్రోఫీ అందిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ ఆహ్వాన వాలీబాల్ టోర్నీ విజేతగా ఈకో రైల్వే జట్టు నిలిచింది. హోరాహోరీగా సాగిన మెన్ ఫైనల్స్‌లో ఈకోర్సా జట్టు 3-1 సెట్ల తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. బెస్ట్ ఆఫ్ ఫైవ్‌గా సాగిన ఫైనల్‌లో ఈకోర్సా జట్టు తొలి సెట్‌ను 25-9తో ఆధిక్యాన్ని ప్రదర్శించినా రెండో సెట్‌లో 25-10తో ప్రకాశం జట్టు సమం చేసింది. 25-16, 25-14 పాయింట్ల తేడాతో తరువాత రెండు సెట్లలోనూ ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఈకోర్సా విజేతగా నిలిచింది. దీంతో ప్రకాశం జట్టు రన్నరప్‌గా సరిపుచ్చుకుంది. వుమెన్ ఫైనల్స్‌లో పికెఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల జట్టుపై కిట్ వర్సిటీ జట్టు విజయం సాధించింది. వుమెన్‌లో బెస్ట్ అటాకర్‌గా సింధూర, బెస్ట్ లిబిరోగా విద్యశ్రీ, బెస్ట్ సెట్టర్‌గా అశ్వతి నిలిచారు. రైల్వే గ్రౌండ్స్‌లో ఆదివారం మెన్ మూడో స్థానానికి జరిగిన పోటీలో కృష్ణా జిల్లా జట్టు 25-20తో ముందంజలో నిలిచినా రెండో సెట్‌లో తూర్పుగోదావరి జిల్లా జట్టు 16-25తో సమం చేసింది. చివరికి డిసైడింగ్ సెట్‌లో 15-9తో కృష్ణా జట్టు విజయం సాధించి సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. వుమెన్ మూడో స్థానానికి జరిగిన పోటీలో ఎస్‌బిపి ట్రస్ట్ జట్టు నేరుగా 2-0 సెట్లతోనే జెపిఆర్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ ట్రోఫీలందజేశారు.

పేద విద్యార్థులకు బాసట

- అర్హులందరికీ అమ్మ ఒడి వర్తింపు
- ఒకొక్కరికి రూ.15 వేలు మంజూరు
- నాలుగేళ్ల కాలంలో రూ. 592.87 కోట్ల జమ
- పెరుగుతున్న హాజరు శాతం



సాక్షి, పాడేరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 'జగనన్న అమ్మ ఒడి'పథకం నిరుపేద విద్యార్థుల చదువులకు భరోసాగా నిలిచింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించింది. ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమైన వారంతా అమ్మ ఒడి ఉందనే ధీమాతో మళ్లీ బడిబాట పట్టారు.

పథకం వివరాలు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	ఆర్థిక లబ్ధి(రూ.కోట్లలో)
2019-20	96,250	144,37,50,000
2020-21	98,126	147,18,90,000
2021-22	99,706	149,55,90,000
2022-23	1,01,170	151,75,50,000
మొత్తం	3,195,172	592,87,80,000

అమ్మ ఒడికి అర్హతే ప్రామాణికం

విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించాలనే ఉన్నతాశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నప్పటికీ.. అర్హతే ప్రామాణికంగా అమ్మ ఒడి మంజూరు చేశారు. పథకం పారదర్శకంగా అమలు చేసే క్రమంలో సచివాలయం స్థాయిలో లబ్ధిదారుల ఈకేవైసీ ధ్రువీకరణ, ఆధార్ కార్డు అనుసంధానంతో ఉన్న బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. మధ్యవర్తులు లేకుండా.. నేరుగా లబ్ధిదారులకు డబ్బులు అందుతున్నాయి.

ప్రతీ విద్యార్థికి రూ.60 వేలు

ఏటా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి అమలైంది. ఏడాదికి రూ.15వేలు చొప్పున ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం మొత్తంగా రూ.60 వేలు అందజేసింది. ముందస్తు షెడ్యూల్ మేరకు 2023-24కు సంబంధించి మరో రూ.15 వేలు ఈ వేసవి సెలవులు అనంతరం స్కూళ్లు తెరిచిన తర్వాత తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి.

విద్యాకానుకతో ధీమా

జగనన్న విద్యాకానుక పథకం కింద ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్, నోట్ పుస్తకాలు, బూట్లు, షూస్, సాక్స్, యూనిఫాం (మూడు జతలు) ఇలా తొమ్మిది రకాల వస్తువులను ఇస్తున్నారు. ఒక్కో కిట్‌కు రూ.1,964లు ఖరీదు చేయనుండగా, ఏటా జిల్లాలో లక్ష మందికి పైగా పంపిణీ చేస్తున్నందుకు గానూ ప్రభుత్వం ఏడాదికి రూ.20 కోట్ల వరకు చెల్లిస్తోంది.



పెదగరువు పాఠశాలలో విద్యార్థినులు

చదువుకు ఆర్థిక భరోసా



హుకుంపేట కేజీబీవీలో టెన్త్ చదువుతున్న మా కుమార్తె లలితకు అమ్మ ఒడి పథకంతో ఎంతో మేలు జరిగింది. ఏటా రూ.15 వేల చొప్పున నా వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేయడంతో ఆర్థిక అవసరాలు ఎంతో తీరాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మా లాంటి పేద కుటుంబాలు రుణపడి ఉంటాం.

– పాంగి గున్నమ్మ, గరుడాపల్లి, హుకుంపేట మండలం

ఆదుకున్న ప్రోత్సాహం



మా కుమార్తె గీతాంజలి కుమ్మరివీధి ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. 2019లో చేరినప్పటి నుంచి అమ్మ ఒడి పథకంలో ఏడాదికి రూ.15 వేల చొప్పున మా బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి.నీ మొత్తాన్ని కుమార్తె చదువుకు వెచ్చిస్తున్నాం. చదవించడం భారంగా ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న సాయం తమకు ఎంతగానో ఉపయోగపడింది.

– పూర్ణిమ, కొండబాబు, తల్లిదండ్రులు, కుమ్మరివీధి, పెదబయలు మండలం

వైఎస్సార్‌సీపీ గెలుపునకు
సైనికుల్లా పనిచేయాలి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, పక్కన ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం : వైఎస్సార్‌సీపీ కంచుకోటలో మరోసారి పార్టీ జెండాను ఎగర వేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉత్సాహంతో సైనికుల్లా పనిచేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) పిలుపునిచ్చి కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహాన్ని నింపారు. రంపచోడవరం మండలం జాగరంపల్లి గ్రామంలో రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రసంగించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో సీఎం జగనన్న గిరిజనుల గుండెల్లో చెరగని ముద్ర వేశాయన్నారు. ఐదేళ్ల కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. దేశంలో మరెక్కడ లేని విధంగా రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనను జగనన్న అందించారన్నారు. ఎమ్మెల్సీ అనంత బాబు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమ పథకాలు అమలు విషయంలో తనతో పాటు రంపచోడవరం ఎమ్మెల్యేగా నాగులపల్లి ధనలక్ష్మి ఎంతో శ్రమించామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రంపచోడవరం ఎమ్మెల్యేగా ధనలక్ష్మిని మరోసారి భారీ మెజార్టీతో గెలించాలన్నారు. 2014 నుంచి నేటి వరకు పార్టీ బలపర్చిన అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు, నాయకులు ఎంతో కృషి చేస్తున్నారని, అదే ఉత్సాహంతో ఈ ఎన్నికల్లోనూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అనంత బాబు తన ప్రసంగంలో నాయకులను, కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రసంగిస్తూ గత ఎన్నికల్లో తనను ఆశీర్వాదించి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ గెలిపించారని, ఈ ఎన్నికల్లో మరోసారి జగనన్న అవకాశం ఇచ్చారని మీ అందరి ఆశీస్సులు అందించాలని అభ్యర్థించారు. మండల పార్టీ కన్వీనర్ జె.రామన్నదొర, ఎంపీపీ బంధం శ్రీదేవి, పండా వెంకటలక్ష్మి, పార్టీ ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సాయం.. మరువలేం





బాధిత మత్స్యకారులకు చెక్కు ఇస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అప్పలరాజు, ఎంపీలు మోపిదేవి, ఎంవీవీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి, వాసుపల్లి, నాగిరెడ్డి

- హార్బర్‌లో బోట్ల ప్రమాద బాధితులకు మూడు రోజుల్లోపే పరిహారం
- రూ.7.11 కోట్లు అందించి ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కన్నీళ్ల స్థానంలో పెల్లుబికిన ఆనంద భాష్పాలు
- సీఎం జగన్ సాయాన్ని మరవబోమంటున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : పార్టీలను చూడలేదు.. పక్షపాతమూ చూపలేదు.. బాధితులను ఆదుకోవాలన్న దృఢ నిశ్చయం. అదే సంకల్పంతో ఫిషింగ్ హార్బర్ బోట్ల దగ్ధం ప్రమాద బాధితులకు గంటల వ్యవధిలోనే పరిహారాన్ని అందించారు. ఆ పరిహారం మొక్కుబడిగా కాదు.. వారు ఊహించనంత.. ఉక్కిరి బిక్కిరయ్యేటంత! దీంతో ఈ మత్స్యకారులంతా కష్టకాలంలో తక్షణమే తమను ఆదుకున్న దేవుడంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కొనియాడుతున్నారు. ఆయన చేసిన సాయాన్ని మరవబోమంటున్నారు. ఆయనకు ఎల్లప్పుడూ అండగా ఉంటామంటున్నారు.

గత ఏడాది నవంబరు 19వ తేదీ అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు ఆహుతయ్యాయి. వీటిలో 30 బోట్లు పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో తమ పట్ల ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనని బాధిత మత్స్యకారులు ఎంతగానో కలత చెందారు. రూ.లక్షల విలువైన మరపడవలు కాలిపోవడంతో తమ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళనకు గురయ్యారు. పిల్లా పాపలతో రోడ్డెక్కి రోదించారు. జరిగిన నష్టంలో ఎంతో కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటారేమోనని భయపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఈ ప్రమాదాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూశారు. ఈ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సాయం చేయదంటూ బాధితులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. కానీ బాధితుల భయాందోళనలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెనువెంటనే స్పందించి అత్యంత ఉదారమైన నిర్ణయాన్ని తీసుకున్నారు.

తక్షణమే స్పందించిన సీఎం

ప్రమాదం జరిగిన వెంటనే సీఎం జగన్ ఉన్నత స్థాయి అధికారులను రంగంలోకి దించారు. మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును హార్బర్‌కు పంపారు. బోట్ల దగ్ధంతో మత్స్యకారులకు వాటిల్లే నష్టాన్ని అంచనా వేయించారు. నష్టంలో 80 శాతం మొత్తాన్ని పరిహారంగా చెల్లిస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతే కాదు బాధిత మత్స్యకారులకు వెంటనే పరిహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఆఘమేఘాలపై బాధితుల జాబితాను రూపొందించారు. 30 బోట్లు పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా దగ్ధమైనట్టు తేల్చారు. మూడు రోజుల్లోనే బోటు విలువలో 80 శాతం సొమ్మును పరిహారంగా బాధితులందరికీ చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. మొత్తం 7.11 కోట్ల మొత్తాన్ని అందజేశారు.

దీంతో పరిహారంపై వీరికున్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. అలాగే అగ్ని ప్రమాదంలో కాలిపోయిన బోట్లపై ఆధారపడిన 400 మంది కలాసీల (వర్కర్ల)కు కూడా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించారు.

పరిహారం.. అనూహ్యం

వాస్తవానికి జరిగిన నష్టంలో 50 శాతానికి మించి ప్రభుత్వం పరిహారం ఇవ్వదని భావించారు. అయితే సీఎం జగన్ ఏకంగా 80 శాతం సొమ్ము చెల్లించే సరికి బాధిత మత్స్యకారుల ఆనందానికి అవధుల్లేవు. ప్రతిపక్ష నాయకుల నోట నుంచి మాటల్లేవు. అప్పటిదాకా కన్నీళ్లు ఉబికిన బాధితుల కళ్ల నుంచి ఆనందభాష్పాలు కురిశాయి. తాము ఊహించిన దానికంటే ఎక్కువ పరిహారం ఇచ్చారని కొనియాడుతున్నారు. ఇప్పుడు వీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ పాలిట దేవుడని, జీవితాలు నిలిపిన ఆయనకు జీవితాంతం అండగా ఉంటామంటున్నారు.

జగన్ సాయం మరచిపోం



బోటు కాలిపోయింది.. ఇక జీవితాలేమవుతాయోనని ఆందోళన చెందిన మాకు సీఎం జగన్ భారీ పరిహారమిచ్చి ఆదుకున్నారు. హార్బర్‌లో కాలిన మా బోటు (వీ-5ఎంఎం-836)కు రూ.23.20 లక్షల పరిహారం అందింది. రూ.28 లక్షలతో ఓ పాత బోటు కొని రీమోడల్ చేయించుకుంటున్నాం. సీఎం జగన్ మేలు మరచిపోం. ఆయన మళ్లీ సీఎం కావడానికి పాటుపడతాం.

– వాసుపల్లి ఎల్లమ్మ, బాధిత బోటు యజమాని, రెల్లివీధి

బాబు అయితే ఇంత ఇచ్చేవారు కాదు

హార్బర్‌లో కాలిపోయిన మా బోటు (వీ-5ఎంఎం 222)కు రూ.28.80 లక్షలు చెల్లించారు. అంత సాయాన్ని, అదీ మూడురోజుల్లోనే ఇస్తారని మేం అస్సలు ఊహించలేదు. పరిహారం సొమ్ములో రూ.20 లక్షలతో పాత బోటును కొన్నాం. మరో రూ.8 లక్షలు మరమ్మతులకు పెట్టి వేటకు సిద్ధం చేశాం. ఈ ప్రమాదం చంద్రబాబు పాలనలో జరిగి ఉంటే రూ.5–6 లక్షలకు మించి వచ్చేది కాదు.

– గిరికిన దానయమ్మ, బాధితురాలు

అంత పరిహారాన్ని ఊహించలేదు



దగ్ధమైన నా బోటు (వీ-5ఎంఎం 167)కు సీఎం జగన్ రూ.20.40 లక్షలు చెల్లించారు. ఇంత పరిహారం ఇస్తారని మేం కలలో కూడా అనుకోలేదు. పైగా మూడురోజుల్లోపే చెక్కులు చేతికిచ్చారు. ఈ డబ్బుతో బోటు కొనుక్కుని నెల రోజుల్లోనే తిరిగి వేట ప్రారంభించాం. సీఎం జగన్ చేసిన సాయానికి జీవితాంతం రుణపడి ఉంటాం. వచ్చే ఎన్నికల్లో తామంతా ఆయనకు అండగా నిలుస్తాం.

– మైలపిల్లి చిన్నయ్య, బాధిత బోటు యజమాని

పక్షపాతం లేకుండా పరిహారం



బోట్లు కాలిపోయిన బాధిత మత్స్యకారుల్లో టీడీపీకి చెందిన వారు కూడా ఉన్నారు. అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలను చూడకుండా, పక్షపాతం లేకుండా పరిహారం అందజేసింది. అగ్ని ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే సొమ్ము చెల్లించింది. దీంతో కొద్ది రోజుల్లోనే మత్స్యకారులు బోట్లు కొనుక్కుని తమ జీవనోపాధి కొనసాగించడానికి తోడ్పడింది. బాధితులు ఊహించిన దానికంటే మూడు నాలుగు రెట్లు అధికంగా పరిహారం చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే. దీనిని బట్టి మత్స్యకారుల పట్ల ఆయనకున్న అభిమానం, ఉదారత ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

వేడుకగా నాగవల్లి వసంతోత్సవం

- వడ్డాదిలో ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం
- భారీ బందోబస్తు మధ్య స్వామి వారి ఊరేగింపు
- భారీగా తరలివచ్చిన భక్తులు



శ్రీదేవి,భూదేవి,వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు



వడ్డాది మెట్లు మార్గంలో భక్తుల రద్దీ

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి నాగవల్లి వసంతోత్సవాన్ని ఆదివారం వైభంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి 151వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు జరిగిన నాగవల్లి వసంతోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేంకటేశ్వరస్వామి కొలువైన గిరిజాంబ కొండకు వెళ్లే రహదారులన్నీ భక్తులతో రద్దీ మారాయి. గోవింద నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. కొండపై నుంచి వేంకటేశ్వర స్వామి,శ్రీదేవి,భూదేవి ఉత్సవ విగ్రహాలను కొండ దిగువకు తీసుకువచ్చి ప్రత్యేకంగా తయారు చేయించిన రథంపై ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో వడ్డాది వీధుల్లో తిరువీధి, వసంతోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు వసంతాన్ని జల్లుకుని ఆనందంతో పులకించారు. పలువురు భక్తులు స్వామి వారి రథం లాగడానికి, వసంతం జల్లడానికి పోటీ పడ్డారు. కొంతమంది భక్తులు స్వామి రథం వెంట వీధుల్లో తిరుగుతూ, భజనలు చేస్తూ స్వామిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. మధ్యాహ్నం వడ్డాది శారదా నదిలో ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు అన్నయ్య కుమారుడు శ్రీరామ్ శిరస్సుపై స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ఈవో శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గిరిజాంబ కొండ పైకి చేర్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ ఈశ్వరరావు 80 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి ఆలయం వద్ద భారీగా బాణసంచా కాల్చారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పీడీ దేవికి వెండిపతకం



దేవిని విజేతగా ప్రకటిస్తున్న పోటీల నిర్వాహకులు

నర్సీపట్నం: ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చెట్టుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గుడివాడ దేవి వెండి పతకాన్ని సాధించారు. న్యూఢిల్లీలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొన్నారు. 87 కిలోల కేటగిరీ మహిళా విభాగంలో ఆమె ప్రతిభ కనబరిచి పతకం సాధించింది. నింజాస్ అకాడమీ మెంబర్‌గా పిల్లలకు ఆమె శిక్షణ ఇస్తున్నారు. నింజాస్ అకాడమీ డైరెక్టర్లు వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, సుమ, నాగజ్యోతి తదితరులు ఫిజికల్ డైరెక్టర్ దేవిని అభినందించారు.

నృసింహ యజ్ఞానికి ఏర్పాట్లు

- రేపు అంకురార్పణ.. 1న మహాపూర్ణాహుతి
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: లోక కల్యాణార్థం సింహగిరిపై ఈ నెల 26 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు తలపెట్టిన శ్రీసుదర్శన నారసింహ మహా యజ్ఞానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు చేయనున్నారు. వచ్చేనెల ఒకటిన మహా పూర్ణాహుతి క్రతువుతో ఈ మహాయజ్ఞం ముగియనుంది. ఈ మేరకు సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన యజ్ఞశాలలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో యజ్ఞం వివరాలను సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలియజేశారు. యజ్ఞంలో పాల్గొనే ఉభయదాతలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో రూ.3 వేల టికెట్ తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 1000 టికెట్లను విక్రయించామన్నారు. ఒక టికెట్‌పై ఉభయదాతలతో పాటు ఇద్దరు పిల్లలను అనుమతిస్తామని చెప్పారు. టికెట్ తీసుకున్న ఉభయదాతలు తమకు కేటాయించిన రోజు ఉదయం 6.30 గంటలకల్లా సింహగిరికి చేరుకోవాలని సూచించారు. ముందుగా అంతరాలయ దర్శనం, అల్పాహారం అందించిన అనంతరం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యజ్ఞం నిర్వహిస్తామన్నారు. పూర్ణాహుతి అనంతరం ఉభయదాతలకు ప్రత్యేకంగా పీఏసీ భవనంలో భోజన సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ఉభయదాతలకు ముందు రోజు రాత్రి వస్తే వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. సాధారణ భక్తులు కూడా యజ్ఞాన్ని తిలకించేలా దర్శనాల క్యూలను ఉత్తర రాజగోపురం వైపు మళ్లించామని తెలిపారు.

ఈ నెల 27 నుంచి 31 వరకు తిరువీధి

స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్ మాట్లాడుతూ ఐదు కుండాలతో ఈ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు యజ్ఞశాలలో ఉదయం 7 గంటల నుంచి అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, యాగశాలార్చన, కుంభావాహనం, మండలావాహనం, హోమం, పూర్ణాహుతి జరుపుతామన్నారు. అలాగే 27 నుంచి 31వ తేదీ వరకు సాయంత్రం 4.30 గంటలకు స్వామివారిని ఒక్కో వాహనంపై సింహగిరి మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల ఒకటిన ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం చేస్తామన్నారు. ఈ సమావేశంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, పాలూరి నరసింగరావు, ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

టికెట్లు లభించే స్థలాలు

ఈ మహా యజ్ఞంలో పాల్గొనే భక్తులు సింహగిరిపై కౌంటర్లలో, కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లోను టికెట్లు లభిస్తాయి. www.aptemples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తీసుకున్న టికెట్ల వివరాలను 63038 00739 నంబర్‌కు వాట్సప్ ద్వారా సమాచారం తెలియజేయాలి.

ఘనంగా హోలికా దహనం



పూజలు చేస్తున్న మర్వాడీ మహిళలు

బీచ్‌రోడ్డు: చెడుపై మంచి విజయానికి ప్రతీకగా ఆదివారం ఆర్.కె.బీచ్‌లో ఉత్తరాది ప్రజలు హోలికా దహనం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తీరానికి చేరుకుని.. పిడకల దండకు వేసి అందులో హోలికా అనే రాక్షసిని బొమ్మ వేసి దహనం చేశారు. దహనం నిర్వహణలో మార్వాడీలు హోలికా ముఖ్య పాత్ర పోషిస్తారు. ఈ పండగ వారి సంస్కృతి, సంప్రదాయాల్లో ఓ ముఖ్యమైన భాగం.

అక్రమ మద్యంతో టీడీపీ నేత అరెస్టు

రాంబిల్లి: లోవపాలేనికి చెందిన చెల్లూరి అమ్మోరు ఆదివారం కొందవారపాలెం జంక్షన్ వద్ద అక్రమంగా 9 మద్యం సీసాలతో పట్టుబడినట్టు సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తుండగా అమ్మోరు వద్ద అక్రమంగా మద్యం సీసాలు లభ్యమైనట్టు సీఐ పేర్కొన్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కాగా లోవపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షునిగా అమ్మోరు వ్యవహరిస్తున్నారు. టీడీపీ అధ్యక్షునిగా ఉంటూ అక్రమ మద్యం కేసులో పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది.

వరి కుప్పల దగ్ధం



కాలిపోయిన వరి కుప్పలు

గొలుగొండ: పాత కృష్ణదేవిపేట సమీపంలో బంగారంపేట జాతీయ రహదారి వద్ద ప్రమాదవశాత్తూ మూడు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. వివరాలివి. పాత కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన గొంప శ్రీను, లోవరాజు ఇక్కడ మూడు ఎకరాల్లో వరి పంట వేశారు. ఆదివారం ప్రమాదశాత్తూ ఈ వరికుప్పలు అగ్ని ప్రమాదానికి గురవడంతో సుమారు రూ. 70వేల వరకు ఆస్తి నష్టం వచ్చిందని, అధికారులు పరిహారం అందే విధంగా కృషి చేయాలని రైతులు శ్రీను, లోవరాజు కోరారు.

వేసవి శిబిరాలు.. భవితకు బాటలు



వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్(ఈకోర్సా), వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలో డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఈకార్వో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారుల మానసిక ఉల్లాసానికి, వారితో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడతాయన్నారు.

ఈ నెల 24 నుంచి మే 15వ తేదీ వరకు అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ తదితర అంశాల్లో ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), క్రీడాధికారి ప్రవీణ్ భటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్, కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతపండుకు భలే డిమాండ్

- రూ.450 నుంచి రూ.700 వరకు పలికిన మణుగు ధర
- హాట్ కేక్‌లా విక్రయం



దేవరాపల్లి వారపు సంతలో చింతపండు కోసం ఎగబడిన కొనుగోలుదారులు

దేవరాపల్లి: స్థానిక వారపు సంతలో చింతపండుకు మంచి గిరాకీ నెలకొంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోనే చింతపండుకు ప్రఖ్యాత గాంచిన దేవరాపల్లి వారపు సంతలో తాజా, నాణ్యమైన చింతపండు లభిస్తుండడంతో కొనుగోలు చేసేందుకు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి ప్రజలు ప్రత్యేకంగా ఇక్కడకు వస్తారు. ఆదివారం జరిగిన వారపు సంతకు చింతపండు అరకొరగా రావడంతో డిమాండ్ ఏర్పడింది.

మణుగు (10 కిలోలు) ధర నాణ్యతను బట్టి రూ.450 నుంచి రూ.700 వరకు పలికింది. గతంలో మణుగు ధర రూ. 350 నుంచి రూ.600 వరకు ఉండేది. పలు ప్రాంతాల నుంచి చింతపండు కొనుగోలుకు అధిక సంఖ్యలో ఇక్కడకు రావడంతో అరకొరగా వచ్చిన చింతపండు గంటల వ్యవధిలోనే హాట్ కేక్‌లా అమ్ముడుపోయింది. ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గడంతో పాటు వ్యాపారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి చింతపండు కొనుగోలు చేయడంతో వారపు సంతకు చింతపండు రావడం తగ్గిపోయిందని, దీంతో మార్కెట్లో ధరలు పెరిగిపోయాయని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.